క్లుప్తంగా

నమ్మించి మోసం చేయడంలో బాబు దిట్ట



వార్డులో ప్రచారం చేస్తున్న ముత్తాబత్తుల రమేష్, పచ్చిరిపల్లి రాము తదితరులు

అల్లిపురం: నమ్మించి మోసం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిట్ట అని వైఎస్సార్ సీపీ 33వ వార్డు నాయకులు గడప గడపకు వెళ్లి ప్రచారం చేశారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం పార్టీ 33వ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వార్డులో ఇంటింటికీ వెళ్లి బాబు ఎన్నికల హామీలు అమలులో ప్రజలను మోసం చేసిన విధానాన్ని నివాసులకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పచ్చరిపల్లి రాము, వెంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఆడారి వెంకట మహేష్, సాత్ కల్చర్ వింగ్ అధ్యక్షుడు సూర్య నాయుడు, సంతోష్‌కుమార్, మహిళా నాయకులు హేమ, కొల్లు సత్యవతి, లక్ష్మీకాంతం, బి.శ్రీనివాసరావు, పీవీఎస్ రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూజీడీకి మరమ్మతులు



మట్టా బాబూరావు వీధిలో యూజీడీకి మరమ్మతులు చేయిస్తున్న రాము

అల్లిపురం: వెంకటేశ్వరమెట్ట, మట్టా బాబూరావు వీధిలో యూజీడీ మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు లీకవడంతో నివాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్య తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ 33వ వార్డు నాయకుడు పచ్చిరిపల్లి రాము యూజీడీ సిబ్బందికి విషయాన్ని తెలియజేసి శుక్రవారం దగ్గరుండి మరమ్మతులు చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఆధునిక యుగంలో డేటా సైన్స్‌కు ప్రాధాన్యం



విద్యార్థుల పోస్టర్ ప్రెజెంటేషన్‌ను తిలకిస్తున్న డాక్టర్ షేక్ షాహిద్

దాబాగార్డెన్స్: స్థానిక ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం 'విస్మయా 2కె25' పేరిట ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గీతం యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ షేక్ షాహిద్ మాట్లాడుతూ నేటి అత్యాధునిక యుగంలో డేటా సైన్స్ ప్రాధాన్యాన్ని వివరించారు. దీనిలో భాగంగా పోస్టర్ ప్రెజెంటేషన్లు, వివిధ రకాల ప్రాజెక్టులు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన పోస్టర్ ప్రజెంటేషన్‌ను ఆయన తిలకించి అభినందించారు. ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎస్.శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఽవీఎల్ నాయుడు డాక్టర్ షాహిద్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ కళాశాలల రీజనల్ మేనేజర్ పి.రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ కడారి కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌వీ బాబ్జి, డేటా సైన్స్ విభాగాధిపతి ఎం.శివసాయిసందీప్, అధ్యాపకురాలు ఎస్.విజయ వెంకటలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం



వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లో జిమ్ పరికరాలను ప్రారంభిస్తున్న సీఐ రవికుమార్

సీతంపేట: నిత్యజీవనంలో వ్యాయామాన్ని భాగం చేసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని కంచరపాలెం ఐదో పట్టణ సీఐ రవికుమార్ అన్నారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలను, స్విమ్మింగ్ పూల్‌లో లైటింగ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, కార్యదర్శి పి.ఎస్.ఎన్.రాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తుక్కు వాహనాలు వదిలేశారిలా..

- రోడ్డుపైనే తుప్పు పట్టిన వాహనాలు
- పారిశుధ్య నిర్వహణకు ఆటంకం
- విద్యార్థులకు శబ్దకాలుష్యం
- తరలింపునకు విజ్ఞప్తులు
- స్పందించని అధికారులు

అధ్వానంగా రోడ్లు



తుప్పు పట్టిన వాహనాలు నిర్లక్ష్యంగా వదిలేయడంతో నాచు పడుతున్న మట్టి రోడ్లు

గతేడాది బీఆర్‌టీఎస్ సబ్‌వేలో 24/7 మంచినీటి పైపులైన్ల కోసం తీసిన గోతులు, ఇతరత్రా కేబుళ్ల కోసం తీసిన గోతులు సక్రమంగా పూడ్చకపోవడంతో రహదారి గుంతల మయంగా మారింది. ఇక, భారీ వాహనాలు, తుప్పుపట్టిన వాటిని రోడ్డుకు అడ్డంగా నిలపడంతో పారిశుధ్య సిబ్బంది రోడ్లు ఊడ్చడం లేదని పలువురు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోతుల్లో నీరు చేరడం, మొక్కలు, పొదులు ఏపుగా పెరగడంతో రోడ్లు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి.



జ్ఞానాపురం రైల్వేస్టేషన్ రోడ్డులో మూలకు చేరిన వాహనం

ఎర్రిగెడ్డ సమీపంలో నిర్లక్ష్యంగా వదిలేసిన తుప్పు పట్టిన ఆటో

సెయింట్ మేరీస్ విద్యాసంస్థలను ఆనుకుని భారీ వాహనాలకు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

జ్ఞానాపురం శివాలయం వద్ద ప్రధాన రహదారిలో తుప్పు పట్టిన భారీ వాహనం

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారి సబ్‌వేను ఆనుకుని పలు తుప్పు పట్టిన వాహనాలను నెలల తరబడి వదిలేశారు. దీంతో పరిసరాలు అధ్వానంగా మారడంతో పాటు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ జంక్షన్ నుంచి జ్ఞానాపురం రైల్వే స్టేషన్ మీదుగా కాన్వెంట్ జంక్షన్, చావులమదుంకు వెళ్లే మార్గాల్లో తుప్పుపట్టి, మూలకు చేరిన వాహనాలు భారీగా పడి ఉంటున్నాయి. ఎర్రిగెడ్డకు సమీపంలో భారీ వాహనాల మరమ్మతుల గ్యారేజీలు ఉన్నాయి. ఇక్కడికి మరమ్మతులకు తెచ్చే వాహనాలకు రిపేర్ చేయించి, నెల రోజుల్లో మళ్లీ తీసుకువెళ్లిపోతారు. అయితే, బాగా పాడైన వాహనాలను ఇలా నిర్లక్ష్యంగా వదిలేస్తుంటారు. నెలల తరబడి ఇలా రోడ్డుమీద నిర్లక్ష్యంగా వదిలేయడంతో ఆ వాహనాలు తుప్పు పట్టి ప్రమాదకరంగా మారుతున్నాయి. ఎండకు ఎండి, వానకు తడవడంతో మరింత తుప్పు పట్టి, పనికిరాకుండా పోతున్నాయి.

విద్యాసంస్థల ప్రహరీని ఆనుకుని..

జ్ఞానాపురం ప్రధాన రహదారిలో సెయింట్ మేరీస్, జూబ్లీ, సెయింట్ జోసెఫ్, ఆర్‌సీఎం, సేక్రెడ్ హార్ట్ బాలిక పాఠశాల, సోఫియా కళాశాల వంటి విద్యాసంస్థల ప్రహరీలను ఆనుకుని వాహనాలను నిర్లక్ష్యంగా వదిలేయడం, మరమ్మతులు చేస్తుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఇబ్బంది పడుతున్నారు. ఇలా వదిలేయడంతో పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయని చెబుతున్నారు. ఈ వాహనాలను తరలించాలని జోన్–5 అధికారులకు, పోలీస్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. వర్షాలకు వాహనాల వద్ద నిలిచిన నీటితో దోమలు వృద్ధి చెంది, బస్టాపుల్లో ప్రయాణికులు, స్థానికులు, దుకాణదారులు జ్వరాల బారిన పడే పరిస్థితి ఉందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

తుక్కు వాహనాలు తరలించాలి

ప్రధాన రహదారుల్లో తుప్పు పట్టిన వాహనాలను ఇలా వదిలేయడం సరికాదు. ఇటీవల జ్ఞానాపురం ఎర్రిగెడ్డ పొంగినప్పుడు వీధులు, ప్రధాన రోడ్లు నీటితో మునిగాయి. ఇక్కడి తుక్కు వాహనాల వద్ద భారీ గోతులు ఉండడంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందాం. ఇప్పుడు వర్షాకాలం. మరింత ప్రమాదకరం. అధికారులు స్పందించి, తుక్కు వాహనాలు తరలించి రోడ్లు బాగుచేయాలి.

– ఐయితి రాంబాబు, పాదచారుడు, కంచరపాలెం

అధికారులు స్పందించాలి

జ్ఞానాపురం రైల్వేస్టేషన్ రహదారికి వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్డులో సమీప పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, సిబ్బంది శబ్ద కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నారు. రోడ్లకు ఇరువైపులా భారీ వాహనాల మరమ్మతులు చేపడుతుండటంతో ఈ పరిస్థితి వస్తోంది. అధికారులు స్పందించి, సమస్య పరిష్కరించాలి.

– ఆర్ వేళంగిణిరావు, స్థానికుడు, జ్ఞానాపురం

శ్రావణలక్ష్మికి విశేష పూజలు



పండ్లు, డ్రై ఫ్రూట్స్ అలంకరణలో ఉమాదేవి



విశేష అలంకరణలో సాగరగిరి కనకదుర్గమ్మ

అల్లిపురం: శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. టూటౌన్ దరి శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన ఉమాదేవి ఆలయంలో అమ్మవారిని రకరకాల పండ్లు, డ్రై ఫ్రూట్స్‌తో అర్చకుడు భార్గవశర్మ ఆధ్వర్యంలో విశేషంగా అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. నీలమ్మవేపచెట్టు అమ్మవారి దేవస్థానంలో విశేష పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకుడు జోగారావుశర్మ చేపట్టారు. అల్లిపురం అలమేలు మంగమ్మ ఆలయం, మూడుగుళ్ల కనకదుర్గమ్మ ఆలయం, కెప్టెన్ రామారావు జంక్షన్ రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయం, జెండాచెట్టు వీధి విజయదుర్గాలమ్మ, యారాడ కొండపై వెలసిన సాగరగిరి కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు.

వాల్తేర్ డివిజన్‌లో 'స్వచ్ఛతా అభియాన్'



రైల్వేస్టేషన్‌లో అధికారులు, సిబ్బంది, స్వచ్ఛ సేవకుల చేత స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్‌లో శుక్రవారం స్వచ్ఛతా అభియాన్ కార్యక్రమం ప్రారంభమైంది. విశాఖ రైల్వే స్టేషన్‌లో ఈ కార్యక్రమాన్ని డీఆర్‌ఎం లలిత్ బోహ్రా ప్రారంభించి మాట్లాడారు. పరిశుభ్రమైన వాతావరణం కోసం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించడం, సమర్థవంతంగా చెత్త తరలించడం, ప్రజల్లో అవగాహన కల్పించడం స్వచ్ఛతా అభియాన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రైల్వే పరిసర ప్రాంతాలను ప్లాస్టిక్, చెత్త, వ్యర్థాల రహితంగా ఉంచడమే లక్ష్యమన్నారు. అనంతరం రైల్వే ఉద్యోగులు, సిబ్బంది, పారిశుధ్య సేవకులు, ప్రయాణికుల చేత డీఆర్‌ఎం స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. రైల్వేస్టేషన్ పరిసరాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 15 వరకు స్వచ్ఛతా అభియాన్ కార్యక్రమాలు జరుగుతాయని అధికారులు తెలిపారు. వాల్తేర్ డివిజన్‌లోని శ్రీకాకుళం రోడ్, విజయనగరం, రాయగడ, కోరాపుట్, జగదల్‌పూర్, కిరండూల్, అరకు, సింహాచలం, దువ్వాడ రైల్వే స్టేషన్లు, ఎలక్ట్రికల్ లోకోషెడ్, డీజిల్ లోకోషెడ్, కోచ్ కేర్ సెంటర్, ఇతర అన్ని విభాగాల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారన్నారు. పర్యావరణం, హౌస్‌కీపింగ్ మేనేజ్‌మెంట్ విభాగం పలు ఆకస్మిక పారిశుధ్య డ్రైవ్‌లు నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, ఏడీఆర్‌ఎం(ఇన్‌ఫ్రా) ఇ.శాంతారాం, సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్, ఎన్విరాన్‌మెంట్ కం హౌస్‌కీపింగ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ప్రవీణ్ భటి, ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టండి



తారకరామా కాలనీలో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

అల్లిపురం: విద్యుత్ శాఖ ఉద్యోగులమని చెప్పి అదానీ సంస్థ ఉద్యోగులు మీ ఇంటికి వచ్చి స్మార్ట్ మీటర్లు బిగిస్తే.. వాటిని తక్షణమే పగలగొట్టాలని సీపీఎం సీనియర్ నాయకుడు వై.రాజు ప్రజలకు పిలుపునిచ్చారు. తారక రామారావు కాలనీలో శుక్రవారం పార్టీ జగదాంబ జోన్ కన్వీనియన్స్ కమిటీ కన్వీనర్ సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు పెడితే.. వాటిని పగలగొట్టండని పిలుపునిచ్చిన లోకేష్ నేడు ప్రధాని మోదీ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రజలపై గుదిబండ పెట్టబోతున్నారన్నారు. ఈ స్మార్ట్ మీటర్లు సెల్‌ఫోన్ రీచార్జ్ చేసుకునే విధంగా ముందుగానే రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. సీఐటీయూ జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కర్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యుత్ బిల్లుకి మన తెల్ల రేషన్ కార్డుకి లింకు పెట్టడం వల్ల బిల్లు ఎక్కువగా వస్తే తెల్ల రేషన్ కార్డు రద్దు అవుతుందన్నారు. తద్వారా పలు సంక్షేమ పథకాలు పోతాయని, ఎట్టి పరిస్థితుల్లో స్మార్ట్ మీటర్లు పెట్టకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. తారక రామారావు కాలనీ వాసులు ఎట్టి పరిస్థితుల్లో స్మార్ట్ మీటర్లు పెట్టబోనివ్వమని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీపీఎం కార్యకర్తలు అప్పన్న, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి పిలుపునిచ్చారు. నరసింహనగర్ రైతుబజార్ వద్ద శుక్రవారం చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఈ నెల 5న గురుద్వారా దరి విద్యుత్ సీఎండీ కార్యాలయం వద్ద కార్మిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు పగలకొట్టండని పిలునిచ్చిన లోకేష్.. నేడు వాటి ఏర్పాటుకు ఒత్తిడి చేస్తున్నారని మండిపడ్డారు. స్మార్ట్ మీటర్ల ఖరీదును వినియోగదారులే భరించాలని, వాటి మొత్తాన్ని 93 నెలల బిల్లుతోపాటు అదనంగా చెల్లించాలని తెలిపారు. ప్రజలు విద్యుత్ ఎక్కువగా వాడే సమయాల్లో చార్జీలు ఎక్కువగా వసూలు చేస్తారని, వేసవిలో ఈ భారం మరింత పెరుగుతుందన్నారు. స్మార్ట్ మీటర్ల రిపేరు ఖర్చులు కూడా ప్రజలే భరించాల్సి వస్తుందన్నారు.

13 ఏళ్ల తరువాత ఇంటికి జార్ఖండ్ వాసి



కుటుంబ సభ్యుల చెంతకు చేరుకున్న అర్జున్ నిషద్

అల్లిపురం: గంజాయికి బానిసై, మతిస్థిమితం కోల్పోయి కుటుంబానికి దూరమైన జార్ఖండ్‌కు చెందిన అర్జున్ నిషద్ విశాఖ నగరానికి చేరుకుని అనాథలా బతికాడు. అతడిని ఏయూటీడీ సిబ్బంది రెస్క్యూ చేసి జీవీఎంసీ వసతి గృహానికి తరలించారు. అక్కడ చికిత్స అందించడంతో సాధారణ స్థితికి చేరుకున్నాడు. ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, శ్రద్ధ ఫౌండేషన్ ప్రతినిధులు అతడి కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకున్నారు. అర్జున్ నిషద్ చిన్న వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. గంజాయికి అలవాటు పడి మానసిక స్థితి పాడవడంతో అతడి భార్య వదిలి వెళ్లిపోయింది. అర్జున్ ఇద్దరు కుమార్తెలను అతడి పెద్దమ్మ చూసుకుంటోంది. శ్రద్ధ ఫౌండేషన్, ఏయూటీడీ సిబ్బంది అతడిని సొంతూరికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు. 13 ఏళ్ల తరువాత తండ్రిని అతడి కుమార్తెలే గుర్తుపట్టలేని పరిస్థితి నెలకొంది. అర్జున్ ఆరోగ్యం మెరుగుపడి, జాగ్రత్తగా అప్పజెప్పడంతో కుటుంబ సభ్యులు, కుమార్తెలు అతడిని చూసి చాలా ఆనందించారు. ఏయూటీడీ, శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

కామన్ రూల్స్ విస్మరించడం అన్యాయం

- నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



ఎస్‌జీజీవోస్ కాలనీ హైస్కూల్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సీతంపేట: రాష్ట్ర ప్రభుత్వం కామన్ రూల్స్‌కు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ జూనియర్లకు ఎంఈవోలుగా బాధ్యతలు కట్టబెట్టడం అన్యాయమని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీతో భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.వి.విశ్వనాథం మాట్లాడుతూ గవర్నమెంట్ మేనేజ్‌మెంట్ పాఠశాలలో పనిచేసే స్కూల్ అసిస్టెంట్లకు, హెడ్ మాస్టర్లకు ఎంఈవోలుగా బాధ్యతలు కట్టబెట్టడం లక్షలాది మంది సీనియర్లయిన జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయులకు అన్యాయం చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్, మున్సిపల్ స్కూల్స్ ఉపాధ్యాయులను విస్మరించడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. ఈ అన్యాయాన్ని గట్టిగా ఎదుర్కోడానికి ఆపస్, పీఆర్టీయూ రాష్ట్ర నాయకత్వాలు ఇచ్చిన ఉమ్మడి పిలుపు మేరకు నిరసన చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, శ్యామల, వై.రామలక్ష్మి, రమణశ్రీ, ప్రభాకర్, రత్నం, పుష్పలత పాల్గొన్నారు.

హామీలు అమలు చేసే దమ్ముందా..?

- 'కూటమి'ని నిలదీసిన వైఎస్సార్‌సీపీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్
- 37వ వార్డులో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'



అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నివాళులర్పిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్



బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వాసుపల్లి, పార్టీ నాయకులు

దాబాగార్డెన్స్: ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయకుండా సుపరిపాలనలో తొలి అడుగంటూ మాట్లాడటం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ కూటమి ప్రభుత్వాన్ని విమర్శించారు. ఒక్క పథకమైనా అర్హులందరికీ అందజేశామని ప్రజలకు చెప్పే దమ్ముందా.. అంటూ నిలదీశారు. 37వ వార్డులోని అంబేడ్కర్ కల్యాణ మండపంలో కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా రెల్లి వీధి జంక్షన్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ, పలువురు పార్టీ నాయకులతో కలిసి వాసుపల్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఏడాదిన్నర పాలనలో చంద్రబాబు చేసిన మోసాలు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సుపరిపాలనపై మధ్య వ్యత్యాసాన్ని పార్టీ కార్యకర్తలు, స్థానికులకు వివరించారు. దృశ్యమాలిక ద్వారా అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికీ వెళ్లి 18 నెలల్లో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన విధానాన్ని, ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాలను వివరించాలన్నారు.

పథకాలు అమలు చేయకుండా పంగనామాలు

ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్నే అమ్మేయాలని సాక్షాత్తు టీడీపీ మంత్రి అచ్చెన్నాయుడు బహిరంగంగా వ్యాఖ్యానించడం సిగ్గుచేటని వాసుపల్లి విమర్శించారు. ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం, 50 ఏళ్లకే పెన్షన్, ఉచిత బస్సు అంటూ మహిళలకు పంగనామాలు పెట్టారన్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతకు 18 నెలలు బాకీ పడ్డారని చెప్పారు. విద్య, వైద్యాన్ని పూర్తిగా అటకెక్కించారని, పేదల సంక్షేమం పట్టని చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేష్ పూర్తి అసమర్థులుగా మరోసారి రుజువయ్యారని పేర్కొన్నారు. రైతుల గిట్టుబాటు ధరపై ప్రశ్నించని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన సినిమా టికెట్ మాత్రం రూ.700కు పెంచుకున్నాడని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ విభాగం అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, వార్డు అధ్యక్షుడు ఆకుల యేసు, పార్టీ నాయకులు రెయ్యి డేవిడ్‌రాజు, గనగల రామరాజు, బొడ్డు ఆనంద్, గుంటు ఆనంద్, సారిక గోపి దైవకుమార్, గరికిన చంద్రశేఖర్, డాక్టర్ రమణ, రోజారమణి, సతీష్, మల్లేష్, లక్ష్మీపతి, 34, 41, 31 వార్డుల కార్పొరేటర్లు తోట పద్మావతి, కోడిగుడ్ల పూర్ణిమ, బిపిన్ కుమార్ జైన్, పలు వార్డుల అధ్యక్షులు కోడిగుడ్ల శ్రీధర్, నీలాపు సర్వేశ్వరరెడ్డి, ముత్తాబత్తుల రమేష్, పీతల వాసు, దశమంతుల మాణిక్యాలరావు, దొడ్డి బాపూ ఆనంద్, రాజారెడ్డి, అలపున కనకారెడ్డి, మహ్మద్ షకీల్, ఆకుల యేసు, గురజాపు రవి, ముజీబ్‌ఖాన్, భీశెట్టి ప్రసాద్, పార్టీ నాయకులు పచ్చిరపల్లి రాము, దొడ్డి రామానంద్, ఆదిరెడ్డి విష్ణురెడ్డి, పద్మనాభ అమ్మాజీ, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రేపు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని యోగా విభాగం ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఈ నెల 3న బీచ్ రోడ్డులో గల యోగా విలేజ్‌లో నిర్వహిస్తామని ఆచార్య రమేష్ బాబు తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 11 వరకు డాక్టర్ ఈశ్వరరావు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేస్తారని.. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, వివరాలకు 944019167ను సంప్రదించాలని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఆరిలోవ : జోడుగుళ్లపాలెం తీరానికి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శుక్రవారం కొట్టుకొచ్చింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఆరిలోవ ఎస్ఐ కృష్ణ సిబ్బందితో తీరానికి చేరుకుని పరిశీలించారు. ఆధారాలు మాత్రం లభించలేదు. చేతిపైన జగదీష్, పొట్టపైన అమ్మ అని పచ్చబొట్టుతో రాసి ఉన్నట్లు ఎస్ఐ కృష్ణ తెలిపారు. వివరాలు తెలియకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసి కేజీహెచ్ మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతుని బంధువులు ఆరిలోవ పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.

ఎంఈవోలుగా అందరికీ అవకాశమివ్వాలి



డీఈవో ప్రేమకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఆరిలోవ: ఎంఈవో 1 పోస్టులకు నియామకాలు చేపట్టేటప్పుడు అన్ని పాఠశాలల స్కూల్ అసిస్టెంట్లకు అవకాశం కల్పించాలని పీఆర్‌టీయూ, ఆపస్ సంఘాల ఉపాధ్యాయులు డీఈవో ఎస్.ప్రేమకుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు మాత్రమే ఎంఈవో 1గా నియమించడానికి ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలను వెనక్కు తీసుకోవాలని కోరారు. ఇది ఉమ్మడి సర్వీస్ రూల్‌కు విఘాతం కల్పించడమేనని తెలిపారు. దీనికి నిరసనగా నల్ల బ్యాడ్జీలతో జిల్లాలోని పాఠశాలల్లో చెక్‌డౌన్ చేపట్టినట్లు తెలిపారు. ఒకే డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు కామన్ సీనియారిటీ ప్రాతిపదికన మండల విద్యాధికారులుగా నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మద్దు శ్రీను, నాగేశ్వరరావు, అరుణ్ కుమార్, విశ్వనాథ, సన్యాసినాయుడు, సుదర్శన్ పట్నాయక్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.